కన్నియాకుమారిలో మూడో రోజూ 'అల'జడి

● సముద్రతీర ప్రాంతాల్లో నిఘా



లేమూర్ తీరంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా అంతటా మూడో రోజూ సముద్రతీర ప్రాంతాల్లో రాక్షస అలలు ఎగసిపడ్డాయి. పదడుగుల నుంచి 15 అడుగుల ఎత్తుకు అలలు తీరం వైపు దూసుకువచ్చాయి. ఐదుగురు మెడికోల దుర్మరణానికి కారణమైన లేమూర్ సముద్రతీరంలో పర్యాటకులు ఎవరూ వెళ్ళకుండా అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించినట్లుగానే కన్నియాకుమారి త్రివేణి సంగమం, లేమూరు సముద్రతీర ప్రాంతాల్లో అలల తాకిడి అధికంగా కనిపించింది. మంగళవారం ఉదయం సముద్రతీరం వైపు పర్యాటకులను వెళ్ళకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు. దీంతో సముద్రతీర ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రస్తుతం పర్యాటకులు అధికంగా సంచరించే తీర ప్రాంతాల్లో పోలీసులు నిఘా వేస్తున్నారు. మంగళవారం ఉదయం లేమూరు తీరాన్ని సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులను పోలీసులు వెనక్కి పంపారు. సొత్తవిళై, చిన్న ముట్టమ్, పెరియముట్టమ్ తీర ప్రాంతాల్లోనూ పర్యాటకుల రాకపోకలపై పోలీసులు నిఘా వేశారు.


నిర్మానుష్యంగా ఉన్న సొత్తవిళై సముద్రతీరం

తాగునీటి కొరత లేకుండా చూడండి

కలెక్టర్లకు సీఎస్ ఆదేశం ● రెండోరోజూ సమీక్ష


సీఎస్ శివ్‌దాస్ మీనా

అడయార్, మే 7: వేసవిలో రాష్ట్ర ప్రజలకు విద్యుత్, తాగునీటి సరఫరాల్లో ఎలాంటి అవాంతరాలు, కొరత లేకుండా చూడాలని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ్‌దాస్ మీనా ఆదేశించారు. ఆయన రెండో రోజు కూడా జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో 19 జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. అనేక జిల్లాల్లో రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో బోరు బావులు, చెరువులు ఎండిపోవడంతో తాగునీటి కొరత ఏర్పడింది. అదే సమయంలో వేసవిలో ఏసీలు, కూలర్ల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఎక్కువైంది. ఈ కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అవాంతరం కలుగుతోంది. రాత్రి వేలల్లో అధికారులు అప్రకటిత కరెంట్ కోతలను అమలు చేస్తుండటంతో ప్రజలు అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్, తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ శివ్‌దాస్ మీనా సమావేశం ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ సమావేశం రెండో రోజైన మంగళవారం కూడా జరిగింది. ఇందులో గ్రామీణశాఖ కార్యదర్శి సెంథిల్ కుమార్, పురపాలక శాఖ, తాగునీటి సరఫరా విభాగం కార్యదర్శి కార్తికేయన్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి రాజారామన్, ఇతర ముఖ్య ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే, పుదుకోట, రామనాథపురం, రాణిపేట, శివగంగై, సేలం, తంజావూరు, తేని, తూత్తుకుడి, నెల్లై, తిరుపూర్, తిరువళ్ళూరు, తిరువణ్ణామలై, తిరువారూర్, తెన్‌కాశి, తిరుపత్తూరు, విల్లుపురం, వేలూరు జిల్లాలకు చెందిన కలెక్టర్లు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, ఎంఆర్కే పన్నీర్ సెల్వం, ఏవీ వేలు, పార్టీ కోశాధికారి టీఆర్ బాలు

'విక్రవాండి'కి ఉప ఎన్నిక లేనట్లే ?



ప్యారీస్, మే 7: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏడో విడత పోలింగ్‌తో కలిపి విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించడంపై ఎన్నికల సంఘం మౌనం పాటిస్తోంది. విక్రవాండి నియోజకవర్గం డీఎంకే ఎమ్మెల్యే పుహళేంది అనారోగ్యం కారణంగా ఏప్రిల్ 6వ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో విక్రవాండి అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం ఏడు విడతల్లో నిర్వహిస్తుండడంతో చివరి దశ పోలింగ్ జూన్ 1న జరుగనుంది. ఆ రోజే ఖాళీగా ఉన్న విక్రవాండి శాసనసభ స్థానానికి కూడా ఉప ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని అన్ని వర్గాలు భావించాయి. మరోవైపు, జూన్ ఒకటో తేదీన బైపోల్ నిర్వహిస్తే దానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహూ కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారమిచ్చారు. అయితే, ఉప ఎన్నికకు సంబంధించిన ప్రకటన లేదా నోటిఫికేషన్ వెల్లడిస్తారని ఆ నియోజకవర్గ ఓటర్లు ఎదురు చూశారు. కానీ, ఎన్నికల సంఘం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా, ఈ ఉప ఎన్నిక నిర్వహణపై కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీనికి కారణం.. పంజాబ్, ఉత్తర ప్రదేశ్, బిహార్ తదితర ఎనిమిది రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 54 స్థానాలకు జూన్ 1న ఏడో విడత లోక్‌సభ పోలింగ్ జరుగనుంది. దీనికి సంబంధించిన నామినేషన్ దాఖలు ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. నోటిఫికేషన్ కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఇందులో విక్రవాండి ఉప ఎన్నిక గురించి ఎలాంటి ప్రస్తావన లేనందువల్ల అక్కడ ఇప్పట్లో ఉప ఎన్నిక జరిగే అవకాశం లేదని తేలిపోయింది.

స్టాలిన్ పథకాలు భేష్

డీఎంకే ప్రశంస ● సీఎంతో మంత్రుల భేటీ ● తృతీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత మూడేళ్లుగా అమలు చేసిన విప్లవాత్మకమైన పథకాలన్నీ అంతర్జాతీయ ఖ్యాతిచెందాయని డీఎంకే ప్రశంసించింది. ఈ మేరకు ఆ పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పదేళ్లపాటు అధికారంలో ఉంటూ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన అన్నాడీఎంకే.. బీజేపీతో చేతులు కలిపి 2021 శాసనసభ ఎన్నికల్లో కోట్లు కుమ్మరించిందని, అయినా ఆ పార్టీలు గెలవలేకపోయాయని డీఎంకే విమర్శించింది. స్టాలిన్‌పై, డీఎంకేపై రాష్ట్ర ప్రజలు ఎంతో విశ్వాసంతో, రాష్ట్రానికి మంచి జరుగుతుందనే నమ్మకంతో డీఎంకే కూటమిని గెలిపించారని పేర్కొంది. సీఎం పదవి స్వీకరించిన మరుక్షణమే స్టాలిన్ మహిళల కోసం బస్సుల్లో వెలుగు బాట పయనం పథకం, కరోనా బాధితులకు రూ.4వేల సాయం, ముదల్వరిన్ ముగవరి (సీఎం చిరునామా) పథకం, పాల ధరను లీటర్‌కు రూ.3లు తగ్గింపు తదితర కీలకమైన ఫైళ్లపై సంతకాలు చేసి తమది చేతల ప్రభుత్వమని ప్రకటించుకున్నారని పేర్కొంది. వైద్యరంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులు జరిగాయని, ప్రజల వద్దకే వైద్యం పథకం మంచి సత్ఫలితాలనిచ్చాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 90 శాతానికి పైగా ప్రసవాలు జరుగుతున్నాయని, ఇవన్నీ ద్రావిడతరహా సుపరిపాలనకు చక్కటి ఉదాహరణలని పార్టీ ఆ లేఖలో పేర్కొంది. అధికారంలోకి రాగానే కొత్తగా 45 పరిశ్రమలకు శంకుస్థాపన చేయగా, ప్రస్తుతం 27 పరిశ్రమలు ప్రారంభమై ఉత్పత్తులు కూడా జరిగి, 74 వేలమందికి పైగా నిరుద్యోగ యువకులు లబ్ధి పొందారని ప్రశంసించింది. ఇక బడిపిల్లలకు ప్రవేశపెట్టిన అల్పాహార పథకం గొప్పదనం కెనడా వరకు వ్యాపించిందని, ప్రస్తుతం ఆ దేశంలోని బడిపిల్లలకు కూడా అల్పాహార పథకం అమలు చేస్తున్నారని డీఎంకే అభినందించింది.

సీఎంతో మంత్రుల భేటి

ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సీనియర్ మంత్రులు మంగళవారం ఉదయం భేటీ అయ్యారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మంగళవారంతో మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ని ప్రశంసలతో ముంచెత్తారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, ఏవీ వేలు, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, అన్బిల్ మహేష్, పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు తదితరులు స్టాలిన్‌ను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ మెరీనాబీచ్‌కు వెళ్ళి దివంగత ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి సమాధులను సందర్శించి వాటిపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. అక్కడి నుంచి బయలుదేరి సచివాలయాన్ని చేరుకున్న స్టాలిన్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ఇతర ఉన్నతాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఆయన పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి చేరుకున్నారు. పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, ప్రధాన కార్యాలయం కార్యదర్శి పూచ్చి మురుగన్, హార్బర్ ఖాజా ఇతర పార్టీ ప్రముఖులు స్టాలిన్ పూలమాలలతో ముంచెత్తారు.

దేశానికే ఆదర్శం - మంత్రి ఉదయనిధి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం గత మూడేళ్లుగా అమలు చేసిన పథకాలన్నీ దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కొన్ని పథకాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేస్తుండటం తమకెంతో గర్వకారణంగా ఉందని డీఎంకే యువజన విభాగం నేత, మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. ఈమేరకు తన ఎక్స్ పేజీలో ఓ సందేశం పోస్టుచేశారు. మూడేళ్లలో ముప్ఫై యేళ్లకు సరిపడా అభివృద్ధి సాధించే దిశగా స్టాలిన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆ పథకాలన్నీ ప్రస్తుతం సత్ఫలితాలనిస్తున్నాయని తెలిపారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

● రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహూ


తిరువళ్లూరు జిల్లా పెరుమాళ్‌పట్టిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సత్యప్రద సాహు

అడయార్, మే 7: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కోసం కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహూ తెలిపారు. తిరువళ్ళూరు లోక్‌సభ పరిధిలోని ఈవీఎంలను పెరుమాళ్‌పట్టిలోని ప్రైవేటు పాఠశాలలో ఉంచారు. ఈ స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సత్యప్రద సాహూ మంగళవారం తనిఖీ చేశారు. ఈ ఓట్ల లెక్కింపు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలతో పాటు భద్రతా ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, స్ట్రాంగ్ రూమ్ వద్ద కల్పించిన భద్రతపై కూడా ఆరా తీశారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లకు వస్తున్న రాజకీయ పార్టీల నేతల వివరాలను కూడా ఆయన తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ప్రకటన చేసిన తర్వాత విక్రవాండి శాసనసభ ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తామన్నారు. తిరునెల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు చెందిన అనుచరుల వద్ద రూ.4 కోట్ల స్వాధీనం చేసుకున్న వ్యవహారంపై ఆదాయపన్ను శాఖ, పోలీసులు విచారణ జరుపుతున్నారని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు...

ఒకే రోజు 32 వేల దరఖాస్తులు



చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. 1.50 లక్షల సీట్లకు సింగిల్‌విండో విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు సోమవారం ప్లస్-2 ఫలితాలు వెలువడిన వెంటనే దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమయ్యాయి. ప్లస్-2లో గణితంలో అత్యధిక మార్కులు పొందినవారు, ఫిజిక్స్ కెమెస్ట్రీ వంద మార్కులతో ఉత్తీర్ణులైనవారు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు నమోదు చేయడానికి ఆసక్తికనబరుస్తున్నారు. సోమవారం సాయంత్రం 20 వేల మంది దరఖాస్తు చేశారు. ఇక మంగళవారం ఉదయం 11 గంటలకల్లా 31,877 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 10 వేల మంది రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించారు. 1762 మంది సర్టిఫికెట్లను అప్‌లోడ్ కూడా చేశారని ఇంజనీరింగ్ అడ్మిషన్ల విభాగం కార్యదర్శి పురుషోత్తమన్ తెలిపారు. జూన్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నెట్ సెంటర్లకు వెళ్ళి www.tneaonline,org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్త పాఠ్యాంశాలు చేర్చటంతో ఇంజనీరింగ్ కోర్సులలో చేరే వారి సంఖ్య గతం కంటే విపరీతంగా పెరిగే అవకాశాలున్నాయని ఆయన చెప్పారు.

తగ్గనున్న కటాఫ్ మార్కులు...

ఈ యేడాది ప్లస్-2 పరీక్షలో ఉత్తీర్ణత శాతం గత యేడాది కంటే అధికంగా ఉన్నా నూటికి నూరు మార్కులతో పాసైనవారి సంఖ్య గతం కంటే చాల తక్కువ అని, దీంతో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి కటాఫ్ మార్కులు తగ్గే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి గణితం, ఫిజిక్స్ కెమిస్ట్రీ మార్కులే కీలకమవుతాయన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌లో గ్రీన్ నెట్

● కమిషనర్ రాధాకృష్ణన్ వెల్లడి


సిగ్నెల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ నెట్

అడయార్, మే 7: వేసవి ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండల్లో వాహనాలు నడిపాలంటే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన చోదకులకు నీడ ఉండేలా గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేయనున్నట్టు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం మాట్లాడుతూ వాహన చోదకులకు సిగ్నల్స్ వద్ద కొంతసేపైనా నీడ కల్పించేందుకు వీలుగా నగరంలో ఎంపిక చేసిన 10 సిగ్నల్స్ వద్ద గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం వద్ద ఉన్న రాజా ముత్తయ్య రోడ్డు, ఈవీఆర్ పెరియార్ రోడ్డు జంక్షన్, తిరుమంగళం - రౌండ్‌ఠానా కూడి, కీల్పాక్కం న్యూ అవెన్యూ రోడ్డు, కీల్పాక్కం - చెట్‌పెట్ రోడ్ జంక్షన్, వళ్లువర్‌కోట్టం హైరోడ్డు, 3వ అవెన్యూ జంక్షన్, అడయార్ ఎస్‌పీ సాలై - వెస్ట్ అవెన్యూ రోడ్డు జంక్షన్, తిరువాన్మియూరు పాత మహాబలిపురం రోడ్డు ఇలా పది జంక్షన్ల వద్ద ఈ గ్రీన్ నెట్ ను మూడు రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. అలాగే, చెన్నై నగరంలో నగర వాసుల సౌకర్యార్థం 199 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 1.10 లక్షల మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఇసుక క్వారీల అవినీతి కేసు...

కలెక్టర్లను ఇబ్బంది పెట్టొద్దు

● ఈడీకి సుప్రీంకోర్టు సూచన

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీల అవినీతి కేసు విచారణకు హాజరయ్యే కలెక్టర్లకు అనవసరంగా గంటలకొద్దీ వేచి ఉండే పరిస్థితి కల్పించొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులను సుప్రీంకోర్టు సూచించింది. రాష్ట్రంలోని ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్లు, వారి ఏజెంట్లు పరిమితికి మించి అదనంగా ఇసుక తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారనే ఆరోపణలపై ఈడీ విచారణ జరుపుతోంది. ఇసుక క్వారీల్లో ఈడీ అధికారులు పలుమార్లు తనిఖీ చేసి కీలకమైన పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ పత్రాల్లోని ఆధారంగా తిరుచ్చి, తంజావూరు, కరూరు, అరియలూరు, వేలూరు జిల్లాల్లోని ఇసుక క్వారీలు, వాటి కాంట్రాక్టర్లు, లైసెన్సుదారులు తదితర వివరాలతో విచారణకు హాజరుకావాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈడీ సమన్లు జారీ చేసింది. దానిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు స్టే విధించింది. ఈడీ సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకోగా హైకోర్టు విధించిన 'స్టే'ను న్యాయమూర్తులు బేలా ఎం.త్రివేది, పంకజ్ మిట్టల్‌తో కూడిన ధర్మాసనం తొలగించింది. దీంతో ఐదు జిల్లాల కలెక్టర్లు నుంగంబాక్కం ప్రాంతంలో ఉన్న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరై తమ జిల్లాల్లో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలకు సంబంధించిన వివరాల నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈడీ అప్పీలు పిటిషన్ మళ్లీ మంగళవారం విచారణకు వచ్చింది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ, సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ హాజరై సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం ఐదు జిల్లాల కలెక్టర్లు ఏప్రిల్ 25న ఈడీ విచారణకు హాజరయ్యారని, సమన్లలో అడిగిన ప్రశ్నలన్నింటికి సమాధానాలు తెలిపారన్నారు. అయితే కలెక్టర్లను ఉదయం 11 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు ఈడీ కార్యాలయం వద్ద అనవసరంగా పడిగాపులు పడేలా చేశారని ఆరోపించారు. వెంటనే న్యాయమూర్తులు స్పందిస్తూ విచారణకు హాజరయ్యే కలెక్టర్లను గంటల తరబడి వేచి ఉండేలా చేయడం భావ్యం కాదని, ఇకపై ఈడీ అధికారులు విచారణ త్వరగా ముగించి కలెక్టర్లను పంపాలని ఆదేశించారు. సమన్లలో అడిగిన పత్రాలను జిల్లాల కలెక్టర్లు ఇంకా దాఖలు చేయలేదని ఈడీ తరఫు న్యాయవాది సోబీహాసేన్ ఆరోపించారు. తదుపరి అఫిడవిట్‌ను సమర్పించేందుకు కాస్త వ్యవధి కావాలని కోరారు. దీంతో న్యాయమూర్తులు కేసు తదుపరి విచారణను జూలైకి వాయిదా వేస్తూ ఆలోగా ఈడీ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

సమాచార దర్శిని

తిరునల్వేలి నుంచి తీర్థయాత్ర రైలు

ఐసిఎఫ్, మే 7: తిరునల్వేలి నుంచి తీర్థ యాత్ర రైలు జూన్ 6వ తేదీన నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ దక్షిణ మండలం జనరల్ మేనేజర్ రాజలింగం తెలిపారు. తిరునేల్వేలి నుంచి విరుదునగర్, మదురై, చెన్నై మీదుగా వెళ్లే ఈ తీర్థయాత్రలో కాశీ, గయ, త్రివేణి సంగమం, అయోధ్యలను సందర్శించవచ్చు. పెద్దలకు రూ.18.650, పిల్లలకు రూ.17,560 చార్జీగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుకింగ్ చేసుకోవాలని ఐఆర్‌సీటీసీ జీఎం తెలిపారు.

డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

ఐసిఎఫ్, మే 7: కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సంస్థ (సిపెట్) ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లమో కోర్సులను నిర్వహిస్తోంది. వీటిల్లో చేరేందుకు టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి లేదు. సిపెట్ డిప్లమో పూర్తిచేసిన వారు, ప్లాస్టిక్ టెక్నాలజీ బీటెక్ తరగతుల్లో నేరుగా చేరవచ్చు. ఆసక్తి ఉన్నవారు http://cipet 24.onlineregistrationform.org /cipet వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు www.cipet.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

ఐసిఎఫ్, మే 7: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నడిచే 57 పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో నేరుగా రెండో ఏట విద్యార్థుల అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, జువాలజీ వంటి పాఠ్యాంశాలతో ప్లస్‌టూ ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చు. టెన్త్‌తో పాటు రెండేళ్ల ఐటీఐ ఉత్తీర్ణులైన వారు కూడా నేరుగా సెకండ్ ఇయర్‌లో చేరవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోగా www. tnpoly.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము రూ.150గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీలకు రిజిస్ట్రేషన్ ఫీజు లేదు.

పర్యాటక ప్రాంతాలకు ఎంటీసీ ప్రత్యేక బస్సులు

అడయార్, మే 7: వేసవి సెలవుల సందర్భంగా ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని మెరీనా, వండలూరు, మహాబలిపురం వంటి పర్యాటక ప్రాంతాలకు వంద ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు ఎంటీసీ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా పర్యాటకుల సౌకర్యార్థం మెరీనా బీచ్, బీసెంట్ నగర్, మహాబలిపురం, వండలూరు, గిండి చిల్డ్రన్స్ పార్క్, కోవలం తదితర ప్రాంతాలకు ఈ బస్సులను నడుపుతామని వెల్లడించారు. ఈ బస్సులను వచ్చే నెల మొదటి వారం వరకు నడిపేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఎంటీసీ అధికారి ఒకరు మాట్లాడుతూ, పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ పెరిగిందన్నారు. ప్రధానంగా మెరీనా, బీసెంట్ నగర్ బీచ్, వండలూరు పార్క్, మహాబలిపురం కోవలం, గిండి తదితర ప్రాంతాలకు వెళ్ళే నగర వాసుల సంఖ్య పెరిగిందన్నారు. అందుకే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పర్యాటక స్థలాలకు దాదాపు వంద బస్సులను వచ్చే నెల మొదటి వారం వరకు నడుపుతామన్నారు. వేసవి తాపం నుంచి డ్రైవర్లు, కండర్లు ఉపశమనం పొందేందుకు వీలుగా మట్టి పాత్రల్లో మంచినీరు, మజ్జిగ వంటివి ఉదయం 11 నుంచి 3 గంటల వరకు అందజేస్తామన్నారు. బ్రాడ్వే, టి.నగర్, తిరువాన్మియూరు, అడయారు, తిరువొత్రియూరుతో సహా మొత్తం 70 ప్రాంతాల్లో మజ్జిగ, తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

చెన్నై ఎయిర్‌పోర్టులో డీజీ యాత్రా స్కీమ్ ప్రారంభం

అడయార్, మే 7: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో డీజీ యాత్రా పథకాన్ని త్వరలోనే అమలు చేయనున్నట్టు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేస్తే 'డిజిటల్ యాత్రా స్కీమ్ (డీజీ యాత్రా స్కీమ్)' కింద అనుసంధానిస్తే దేశంలో 14వ విమానాశ్రయంగా చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు గుర్తింపుదక్కనుంది. ప్రయాణికులకు ఎలాంటి అవాంతరాలు, అసౌకర్యం లేకుండా సులభతర సేవలందించేందుకు వీలుగా ఈ డీజీ యాత్రా స్కీమ్‌ను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టింది. 2022 డిసెంబరులో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ఇప్పటికే 13 విమానాశ్రయాల్లో అమలు చేసింది. ఈ పథకం కింద ఒక ప్రయాణికుడు విమానాశ్రయంలోకి అడుగుపెట్టిన తర్వాత తమ లగేజీ తనిఖీ, భద్రత, విమానం ఎక్కేంతవరకు కేవలం ఫేస్ రీడింగ్ చేస్తే సరిపోతుంది. ముఖ్యంగా ప్రయాణికులు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ కార్డు, పాస్‌పోర్టులను సంబంధిత అధికారులకు చూపించాల్సిన అవసరం కూడా లేదు. క్లుప్తంగా చెప్పాలంటే ఈ డిజిటల్ యాత్రా స్కీమ్ అనేది... ప్రయాణికుల ఫేస్ రీడింగ్ విధానం. సగటున 4.58 మిలియన్ ప్రయాణికులు రాకపోకలు చేస్తూ నిత్యం రద్దీగా ఉండే ఈ విమానాశ్రయాన్ని డీజీ యాత్రా స్కీమ్ కింద అనుసంధానం చేయడం వల్ల ప్రయాణికులు తమ ప్రయాణాన్ని మరింత సులభంగా పూర్తి చేసేందుకు దోహదపడుతుందని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు.



తమిళభాషోద్యమ నేత రాబర్ట్ కాల్డ్‌వెల్ 210వ జయంతి సందర్భంగా మెరీనాబీచ్‌లో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి ఎల్.సుబ్రమణియన్, పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్.వైద్యనాథన్ తదితరులు

పెరువెలి ప్రాంతంలో పురావస్తు శాఖ పరిశీలన

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రాన్ని నిర్మించేందుకు ఎంపిక చేసిన పెరువెలి ప్రాంతంలో మంగళవారం ఉదయం పురావస్తు పరిశోధన శాఖ అధికారులు పరిశీలించారు. వడలూరులోని వళ్ళలార్ సత్యజ్ఞాన సభ, వళ్ళలార్ జ్యోతిస్వరూపులై ముక్తినొందిన దేవాలయం ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెరువెలి ప్రాంతంలో పుదుచ్చేరిలోని ఆరోవిల్ తరహాలో వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మించేందుకు ఇటీవల శంకుస్థాపన జరిగింది. ఆ కేంద్రం నిర్మాణ పనులు చురుకుగా జరిగాయి. ఈ నేపథ్యంలో వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు, రాజకీయ పార్టీల నాయకులు నిరసన తెలిపారు. ధర్నా, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావటంతో అక్కడ నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో అంతర్జాతీయ కేంద్రం నిర్మాణ పనులు పోలీసు భద్రతా ఏర్పాట్ల మధ్య మళ్ళీ ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితుల్లో వడలూరు అంతర్జాతీయ కేంద్రం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తులు ఈ నెల 10 వరకు నిర్మాణ పనులను నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చారు. అంతేకాకుండా వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మిస్తున్న స్థలంలో పురావస్తు శాఖ అధికారులు పరిశీలించాలని కూడా ఆదేశించారు. దీంతో పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శివానందం నేతృత్వంలో ఆరుగురు అధికారులు మంగళవారం ఉదయం కడలూరు వెళ్ళి వళ్ళలార్ కేంద్రం నిర్మిస్తున్న స్థలాన్ని పరిశీలించారు.



పెరువెలి ప్రాంతంలో పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు, సిబ్బంది

తిరుచ్చెందూర్ హుండీ ఆదాయం రూ.2.49 కోట్లు

ప్యారీస్, మే 7: తూత్తుకుడి జిల్లా తిరుచ్చెందూర్ సుబ్రమణ్య స్వామి వారి హుండీ ఆదాయం రూ.2.49 కోట్లు వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయానికి వచ్చే భక్తులు హుండీలో కానుకగా వేసే నగదు, నగలు తదితరాలను సోమవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అరుళ్ మురుగన్ నేతృత్వంలో, జాయింట్ కమిషనర్ సమక్షంలో ఆలయ సిబ్బంది లెక్కించారు. ఇందులో మొత్తం రూ.2.29,44,699 ఆదాయం వచ్చినట్లు తేల్చారు. అదే విధంగా 1,100 గ్రాముల బంగారం, 24 కిలోల వెండి భక్తులు కానుకగా అందించినట్లు అధికారులు తెలిపారు.

తెల్ల బర్రెకు జన్మనిచ్చిన నల్ల బర్రె



మురుగేశన్ పెంచుతున్న తెల్ల బర్రె

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): కరూరు జిల్లా నొయ్యల్ సమీపం సేమంగి ప్రాంతానికి చెందిన మురుగేశన్ అనే రైతు పెంచిన నల్ల బర్రె తెల్ల బర్రెకు జన్మనిచ్చింది. ఇప్పటివరకూ నల్ల బర్రెలను చూసి న ఆ ఊరివారంతా ఈ తెల్ల బర్రెను చూడటానికి బారులు తీరారు. మురుగేశన్ కొన్ని బర్రెలను పెంచుతున్నారు. వాటిలో ఓ బర్రె యేళ్లు గడిచినా పిల్లలు కనకపోవడంతో వెటర్నరీ డాక్టర్‌ను సంప్రతించాడు. ఆ డాక్టర్ బర్రెను పరిశీలించిన మీదట సంతానోత్పత్తికోసం సూదిమందు వేశారు. దాంతో ఆ బర్రె కొద్ది రోజులకు ముందు ఓ దూడను ఈనింది. ఆ దూడను చూసిన మురుగేశన్ దిగ్భ్రాంతి చెందాడు. ఆ దూడ నల్లగా ఉండటానికి బదులు తెలుపు రంగులో ఉండటంతో ఆశ్చర్యపోయాడు. ఈ విషయమై ఆ గ్రామ పెద్ద ఒకరు మాట్లాడుతూ బర్రెల సంతానోత్పత్తికి ఇచ్చే సూదిమందులు విదేశాల నుంచి వస్తున్నాయని, ఆ సూదిమందులలో ఒకటి విదేశీ పశు సంతతి వీర్యకణాలుండవచ్చని, ఆ కారణంగా ఈ బర్రె తెలుపు రంగు దూడకు జన్మనిచ్చి ఉంటుందని తెలిపారు.

కామరాజర్ మందిరంలో కనీస వసతులు కల్పించండి

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై



స్మారకమందిరాన్ని కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలిస్తున్న సెల్వపెరుందగై

ప్యారీస్, మే 7: స్థానిక గిండి గాంధీమండపం ప్రాంగణంలో వున్న మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ స్మారక మందిరంలో కనీస వసతులు కల్పించాలని, అక్కడకు వెళ్లే పర్యాటకులకు తాగునీటి వసతి కల్పించాలని టీఎస్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై డిమాం డ్ చేశారు. మంగళవారం ఉదయం రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి సెల్వపెరుందగై కామరాజర్ స్మారకమందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ స్మారక మందిరంలో తాగు నీరు అందుబాటులో లేదని, ఎటు చూసినా చెత్తకుప్పలు, ముళ్లపొదలే కనిపిస్తున్నాయని ఆరోపించారు. తక్షణం ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని కోరా రు. విద్యాదాతగా పేరుగాంచిన కామరాజర్ స్మారకమందిరానికి ప్రతి రోజూ అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, దీనిని పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం విడనాడాలని కోరారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



వేలూరు, మే 7: తిరుపత్తూరు జిల్లా రెడ్డియూరు ప్రాంతానికి చెందిన మహిళా కానిస్టేబుల్ భువనేశ్వరి (23) మంగళవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె జిల్లా పోలీసు కార్యాలయ కంట్రోల్ రూంలో పనిచేస్తోన్న ఆమెకు ఏడాది క్రితమే వివాహమైంది. ఈ నేపథ్యంలో భువనేశ్వరి ఆత్మహత్య చేసుకోవడం సంచలనం రేపుతోంది.

వేలూరు కొత్త బస్టాండు లోపలకు బస్సులు వెళ్లవేం?



వాహనాలు వెళ్లే మార్గంలో ఏర్పడిన గుంత

వేలూరు, మే 7: ఇటీవలే ముఖ్యమంత్రి స్టాలిన్ చేతుల మీదుగా పునఃప్రారంభమైన వేలూరు కొత్త బస్టాండులోకి వెళ్లే బస్సులే కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం బస్టాండు అంతా గందరగోళంగా వుంది. దీనికి తోడు గుంతలమయంగా వుండడంతో బస్సులు అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు ఈ బస్టాండు గురించి పూర్తిగా పట్టించుకోవడం మానేవారు. కోట్లాదిరూపాయలతో నిర్మించిన బస్టాండును ఇలా నిర్లక్ష్యం చేయడం ప్రజాధనాన్ని నీళ్లపాలు చేసినట్లేనన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రయాణీకులు సైతం ఈ బస్టాండులో కూర్చునే పరిస్థితి లేకుండాపోయింది.

నరువి ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్సా విభాగం

వేలూరు, మే 7: వేలూరులో వున్న నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రత్యేక పెరాలసిస్ చికిత్సా విభాగం ఏర్పాటైంది. దీనిని అసోం గవర్నర్ గులాబ్‌చంద్ బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. దీని గురించి ఆసుపత్రి చైర్మన్ జీవీ సంపత్ మాట్లాడుతూ... తమ ఆస్పత్రిలో ప్రపంచంలోని అత్యాధునిక సదుపాయాలు కల్పించామన్నారు. పెరాలసిస్ చికిత్స కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు.

ప్రైవేటు పాఠశాలల బస్సుల పరిశీలన





వేలూరు, మే 7: వేలూరు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన వాహనాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. కాట్పాడిలోని సన్‌బీమ్ పాఠశాల మైదానంలో కలెక్టర్ వాహనాలను పరిశీలించారు. వాహనాల టైర్లు, లోపల భాగాలు, ఇన్సూరెన్స్ తదితరాలన్నింటినీ కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మంగళవారం 441 వాహనాలను కెలక్టర్ పరిశీలించారు. అంతేగాక గుడియాత్తం, కేపీ కుప్పం, పేర్నాంబట్టు తాలూకాల్లోని 32 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 223 వాహనాలను ఈ నెల 9వ తేదీన గుడియాత్తంలోని రాజగోపాల్ పాలిటెక్నిక్ కళాశాలలో తనిఖీ చేస్తామని ఆర్టీవో అధికారి సంపత్ తెలిపారు.

తాగునీటి కొరత రానీయొద్దు

● అధికారులకు వేలూరు కలెక్టర్ ఆదేశం



వేలూరు, మే 7: జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత రానీయొద్దని, ప్రజావసరాల మేరకు తాగునీటిని అందుబాటులో వుంచాలని వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నీటిపారుదల, సంక్షేమ శాఖాధికారులు కలెక్టర్‌తో భేటీ అయ్యారు. జిల్లాలో నీటి వనరులు, కొరత, అవసరాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

యూఎస్ ఎంబసీ ముట్టడికి యత్నం

● ఎస్‌ఎఫ్‌ఐ నేతల అరెస్టు

అడయార్, మే 7: నగరంలోని అమెరికా రాయబారి కార్యాలయం ముట్టడికి యత్నించిన భారతీయ విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ)కు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. పాలస్తీనాకు మద్దతుగా అమెరికాలో విద్యార్థులు ఆందోళన చేశారు. వారిపై అమెరికా పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ చర్యను ఖండిస్తూ థౌజండ్‌లైట్ సమీపంలోని యూఎస్ ఎంబసీని ముట్టడించేందుకు ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సంఘం పిలుపునిచ్చింది. ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టేందుకు అక్కడకు చేరుకున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.

జ్యోతిష్యుడి కిడ్నాప్.. ముఠా కోసం గాలింపు

అడయార్, మే 7: స్థానిక తిరువాన్మియూరులో ఒక జ్యోతిష్యుడిని కిడ్నాప్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ముఠా కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోలీసులు కథనం మేరకు... దురైప్పాక్కం అన్నా వీధికి చెందిన సుందరమూర్తి (48) తిరువాన్మియూరులో నాడీ జ్యోతిష్య కేంద్రాన్ని నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నలుగురు వ్యక్తులు వచ్చి సుందరమూర్తిని బలవంతంగా కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. దీంతో షాక్‌కు గురైన జ్యోతిష్యుడి భార్య విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. కిడ్నాప్ చేసిన ముఠా కోసం గాలిస్తున్నారు.

టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

● 13 నుంచి వినతుల స్వీకరణ

ప్యారీస్, మే 7: రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక విద్యాశాఖ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయుల బదిలీలకు సంబంధించి నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. దీంతో బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు వినతి పత్రాలను ఎమిస్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రాథమిక విద్యాశాఖ తెలిపింది. ఈ శాఖ పరిధిలో ఉన్న ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు, మహోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రతి యేటా మేలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించడం ఆనవాయితీ. ఆ ప్రకారం ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి బదిలీల కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదలైంది. జనరల్ కోటాకు సంబంధించిన వినతులను ప్రధానోపాధ్యాయుడు, టీచర్ల విద్య సమాచార విభాగాల ద్వారా ఈ నెల 13 నుంచి 17 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సీనియారిటీ జాబితా, ఖాళీ పోస్టుల వివరాలు ఈ నెల 20వ తేదీ వెల్లడించనున్నారు. జూన్ 3న మాధ్యమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా నుంచి జిల్లాకు బదిలీ కోరుతూ దరఖాస్తు చేయవచ్చు. ఆరో తేదీ సెకండరీ గ్రేడ్ టీచర్లు ఆయా జిల్లాల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 6, 7, 8 తేదీల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చు. జూన్ 13, 14, 15 తేదీల్లో కూడా జిల్లాల వారీగా జరిగే కౌన్సెలింగ్‌లో కాల్ లెటర్స్ అందుకున్న ఉపాధ్యాయులు పాల్గొనవచ్చని ప్రాథమిక విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

కాంగ్రెస్ నేత జయకుమార్ హత్యకేసు

● విచారణకు హాజరైన తంగబాలు

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సీనియర్ కాంగ్రెస్ నేత జయకుమార్ ఎన్నికల ఖర్చుకోసం తనకు రూ.11లక్షల ఇచ్చినట్లు లేఖలో చేసిన ఆరోపణ అసత్యమని టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితం కేపీకే జయకుమార్ ధనసింగ్ తన తోటలో శవంగా పడి ఉండగా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపారు. మొదట ఈ కేసును అనుమానాస్పద మృతిగా భావించిన పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఎనిమిది ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో ఈ హత్యకేసు విచారణకు టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తంగబాలు, నాంగునేరి కాంగ్రెస్ ఎమ్మెల్యే రూబీ మనోహర్, జయకుమార్ భార్య, కుమారులు, బంధువు డాక్టర్ సెల్వకుమార్ సహా 20 మందికి పోలీసులు సమన్లు పంపించారు. ఆ మేరకు మంగళవారం ఉదయం తంగబాలు తిరునల్వేలిలోని వసతిగృహంలో పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ విచారణలో పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు రాతపూర్వకంగా బదులిచ్చారు. విచారణ పూర్తయిన తర్వాత తంగబాలు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుల కోసం జయకుమార్ తనకు రూ.11లక్షలు ఇచ్చినట్లు లేఖలో చేసిన ఆరోపణ పూర్తిగా అబద్ధమన్నారు.

దారుణ హత్యే...

పోస్టుమార్టం నివేదికను బట్టి జయకుమార్‌ది దారుణ హత్యేనని పోలీసులు నిర్ధారించారు. జయకుమార్‌ను హత్య చేసేందుకు ముందు కేకలు పెట్టకుండా ఉండేందుకు దుండగులు ఆయన నోటిలో ఇనుప పొడి పోసినట్లు పోస్టుమార్టం నివేదిక ద్వారా తెలుస్తోందన్నారు. గొంతులో, కడుపులో ఇనుప పొడి అధికంగా ఉన్నట్లు ఆ నివేదికలో ఉందని తెలిపారు.

డీఎన్ఏ పరీక్షకు డిమాండ్...

శరీరమంతా కాలి లభించిన జయకుమార్ మృతదేహం ఆయనదేనా అనే సందేహం తమకు కలుగుతోందని, పోలీసులు డీఎన్ఏ పరీక్ష చేసి వాస్తవాన్ని ప్రకటించాలని ఆయన కుమారుడు కరుప్పయ్యా డిమాండ్ చేశారు. ఆ మేరకు పోలీసులు త్వరలో డీఎన్ఏ పరీక్ష చేయించనున్నారు. ఇక ఈ నెల రెండోతేదీ రాత్రి దిసైవిసై ప్రాంతంలోని ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో ఫ్యాంట్ చొక్కా ధరించిన జయకుమార్ కొన్ని వస్తువులను కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం జయకుమార్ హత్యకు ముందు తీసిన వీడియో అంటూ సోషల్ మీడియాలో కలకలం సృష్టిస్తోంది.



విచారణకు హాజరై పార్టీ నేతలతో బయటకు వస్తున్న టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు

స్థలం మోసం కేసులో విచారణకు హాజరైన గౌతమి

అడయార్, మే 7: వివాదాస్పద స్థలం విక్రయం కేసులో సినీ నటి గౌతమి పోలీసులు ఎదుట విచారణకు హాజరై, తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. రామనాథపురం జిల్లా నేర విభాగం పోలీసుల ఎదుట ఆమె సోమవారం హాజరు కాగా, పోలీసులకు ఆమె నుంచి సమాచారం సేకరించారు. రామనాథపురం జిల్లా ముదుకుళత్తూరు తాలూకా, కీళత్తూవల్ సమీపంలోని సువాద్దన్ అనే ప్రాంతంలో 64 ఎకరాల భూమి ఉండగా, దీనిని గౌతమి కొన్ని రోజుల క్రితం రూ.3 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ స్థలాన్ని అమ్మడం లేదా విక్రయించరాదని ఓ సంస్థ ఒక ప్రకటన బోర్డు పెట్టింది. దీంతో అప్రమత్తమైన గౌతమి తాను మోసపోయానని గ్రహించి, వివాదాస్పద భూమిని మోసం చేసి మధ్యవర్తి అళగప్పన్, భూ యజమాని విక్రయించినట్టు తెలుసుకుని రామనాథపురం జిల్లా నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణక జరిపిన పోలీసులు.. సోమవారం నటి గౌతమిని విచారణ జరిపారు. ఇందుకోసం ఆమె రామనాథపురం జిల్లా నేర విభాగం పోలీసుల ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చారు.

నదిలో ఈతకెళ్లి ఇద్దరు బాలుర మృతి

ప్యారీస్, మే 7: కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం సమీపంలోని భవానీ నదిలో ఈతకెళ్లిన ఇద్దరు బాలురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే... తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన దురై, ముత్తులక్ష్మి దంపతుల కుమారులు అభినేష్ కుమార్ (10), అవినేష్ కుమార్ (8) ఆ ప్రాంతంలో వున్న ఓ పాఠశాలలో చదువుకుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో వారు తమ మేట్టుపాళయం సమీపంలో సిరుముగై తిమ్మరాజ పాళయం అమ్మమ్మగారింటికి సోమవారం వెళ్లారు. మధ్యాహ్నం భోజనానంతరం వారిద్దరూ ఆ వీధిలో వున్న కొంతమంది పిల్లతో కలిసి సరదాగా ఈతకొట్టేందుకు భవానీ నదికి వెళ్లారు. సాయంత్రం చీకటిపడినా ఇద్దరు మనవళ్లు రాకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల వెతికారు. అయినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నదిలో కొంతదూరాన వారిద్దరి మృతదేహాలు బయల్పడ్డాయి. వాటిని గుర్తించిన గ్రామస్తులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ధూమపానం చేస్తూ వృద్ధుడి మృతి

ప్యారీస్, మే 7: ఓ వృద్ధుడు బీడీ తాగుతూ, ఆదమరిచి చేతిలో పట్టుకున్నాడు. అది కాస్తా ఆయన లుంగీకి అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో ఆ వృద్ధుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటు చేసుకుంది. ఈ నెల 1వ తేదీ తిరువళ్లూరు రాజాజీపురానికి చెందిన రంగరాజన్ (79) బీడీ తాగుతున్న సమయంలో బీడీ నిప్పు లుంగీకి అంటుకుంది. దీంతో రంగరాజన్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం చెన్నై కీల్పాక్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఇక్కడ చికిత్స ఫలించక రంగరాజన్ సోమవారం సాయంత్రం కన్నుమూశాడు.

బ్యాంకు మేనేజర్ ఇంట్లో దోపిడీ

ప్యారీస్, మే 7: స్థానిక ఆవడికి చెందిన బ్యాంకు మేనేజర్ ఇంట్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు 50 సవర్ల నగలు దోచుకుని పరారయ్యారు. ఆవడి కోవిల్ పాద్గై ప్రాంతానికి చెందిన పరశురాం అన్నాసాలైలోని ఓ బ్యాంకులో పని చేస్తున్నారు. ఈయన ఈ నెల 5వ తేదీ ఇంటికి తాళం వేసి తన స్వగ్రామమైన కేరళ వెళ్లాడు. మంగళవారం ఉదయం అతను తన సెల్‌ఫోన్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించగా, ఇంటి తాళం పగలగొట్టబడి వుంది. దీంతో వెంటనే తన మిత్రుడు శాంసన్‌కు ఫోన్ చేసి చూడమన్నాడు. శాంసన్ అక్కడికెళ్లి చూడగా, చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. జాగిలాలతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీ కూడా పరిశీలించారు. మొత్తం 50 సవర్ల బంగారు నగలు చోరీ అయినట్లు తేలింది.

సెంట్రల్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం

ప్యారీస్, మే 7: ఉత్తరాది రాష్ట్రాల నుంచి చెన్నై వస్తున్న రైళ్లలో అక్రమంగా గంజాయి తరలిస్తుండడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒడిశా రాష్ట్రం నుంచి సెంట్రల్‌కు వచ్చిన ఓ ఎక్స్‌ప్రెస్ 9వ నెంబరు ప్లాట్‌ఫారంపై ఆగింది. ప్రయాణీకులంతా వెళ్లిపోయాక ఓ బోగీ బయట పడేసివున్న ఓ మూటను రైల్వే పోలీసులు గుర్తించారు. దానిని విప్పి చూడగా 11 కిలోల గంజాయి బయల్పడింది. ఆ ప్రాంతంలో వున్న సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు.. ఆ మూటను తీసుకొచ్చిన వారి కోసం గాలిస్తున్నారు.

గంజాయి వ్యాపారులతో కుమ్మక్కైన ఇద్దరు పోలీసుల సస్పెన్షన్

ప్యారీస్, మే 7: పుదుకోటలో గంజాయి వ్యాపారులతో కుమ్మక్కైన ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ సస్పెండ్ చేశారు. పుదుకోట ప్రాంతంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఓ మహిళ నేతృత్వంలో గంజాయి ముఠా ఈ చర్యలకు పాల్పడుతోంది. ఆ ముఠాతో సంబంధాలు పెట్టుకున్న పుదుకోట ఎక్సైజ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ కందవేల్, అరంతాంగి స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ముత్తుకుమార్ లను విచారించిన అనంతరం ఎస్పీ వారిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రష్యా ప్రయాణీకుడి సెల్‌ఫోన్ లాక్కున్న ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మే 7: స్థానిక మెరీనాబీచ్‌లో రష్యా పర్యాటకుడి వద్ద సెల్‌ఫోన్ లాక్కున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రష్యాకు చెందిన ఎలక్‌హాన్ పర్యాటక వీసాపై నగరానికి వచ్చారు. గత డిసెంబరులో ఆయన ఢిల్లీ, గోవా తదితర ప్రాంతాలను సందర్శించారు. సోమవారం సాయంత్రం మెరీనాబీచ్ తీరంలో వున్న వివేకానంద హౌస్ సమీపంలో నిలబడి సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తుండగా, గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అతడిని కత్తితో బెదిరించి, సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీనిపై ఆయన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో వున్న సీసీ ఫుటేజీ పరిశీలించి, సెల్‌ఫోన్ దొంగతనం చేసింది అన్నానగర్‌కు చెందిన వెట్రి, విల్లివాక్కంకు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. వారిద్దరినీ మంగళవారం ఉదయం అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.


వేలూరులో చలివేంద్రం ప్రారంభం



వేలూరు, మే 7: వేలూరు జిల్లా అన్నాడీఎంకే కళగం, కాట్పాడి దక్షిణ విభాగం, 8,9డివిజన్ల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటైంది. జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కే అప్పు ఈ కేంద్రాన్ని ప్రారంభించి, ప్రజలకు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సురేష్, భాస్కరన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోవడమే ద్రావిడ తరహా పాలనా?

● మాజీ మంత్రి ఉదయకుమార్



ప్యారీస్, మే 7: రాష్ట్రంలో డీఎంకే ద్రావిడ తరహా పాలన వల్ల ప్రయోజనం శూన్యమని ప్రజలు గ్రహించారని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్పీ ఉదయకుమార్ ఆరోపించారు. డీఎంకే మూడేళ్లపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్పీ ఉదయకుమార్ మంగళవారం మదురైలో మీడియాతో మాట్లాడారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన డీఎంకే ద్రావిడ తరహా పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, ఆస్తి పన్ను పెంపు, పాల ధర పెంపుతో ఈ మూడేళ్లలో 30 ఏళ్ల ఆర్థిక భారాన్ని ప్రజలపై మోపారన్నారు. రుణభారం పెరిగిన రాష్ట్రాల్లో తమిళనాడు అగ్రస్థానంలో వుందని విమర్శించారు.

సవుక్కు శంకర్ బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా



సవుక్కు శంకర్

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): పోలీసులను కించపరిచేలా విమర్శలు చేసి అరెస్టయిన యూట్యూబర్ సవుక్కు శంకర్ బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. శంకర్ యూ ట్యూబ్ ఛానల్‌లో సంచనాలు సృష్టించడమే పనిగా పెట్టుకుని రాష్ట్రంలో గంజాయి అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని, పోలీసులే గంజాయి వ్యాపారం చేస్తున్నారని విమర్శలు చేసి పలు కేసులు ఎదుర్కొంటున్నారు. తాజాగా మహిళా పోలీసులను అసభ్యంగా చిత్రీకరిస్తూ చేసిన విమర్శలపై కోయంబత్తూరు సైబర్ క్రైమ్ సీఐ సుకన్య ఫిర్యాదు చేశారు. దీనితో ఈ నెల నాలుగున తేనిలో దాగిన సవుక్కు శంకర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడు కోయంబత్తూరు నాలుగో జ్యుడీషియర్ మేజిస్ట్రేట్ కోర్టులో బెయిలు కోరుతూ పిటిషన్ పెట్టుకున్నాడు. దానిని పరిశీలించిన మేజిస్ట్రేట్ శరవణబాబు విచారణను పదో తేదీకి వాయిదా వేశారు.

అనల్ అరసుకు 'టారస్ వరల్డ్ స్టంట్ అవార్డు'

● అందుకునేందుకు యూఎస్ వెళ్ళిన స్టంట్ మాస్టర్

చిత్రజ్యోతి

భారతీయ చిత్రపరిశ్రమలోని ప్రముఖ స్టంట్ మాస్టర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన అనల్ అరసుకు ప్రతిష్ఠాత్మక 'టారస్ వరల్డ్ స్టంట్ అవార్డు' వరించింది. ఈ అవార్డును స్వీకరించేందుకు ఆయన అమెరికా వెళ్ళారు. బాలీవుడ్ హీరో షారూక్ ఖాన్ కథానాయకుడిగా, తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'జవాన్'. ఇందులోని పోరాట సన్నివేశాలు హాలీవుడ్ చిత్రాల తరహాలో ఉన్నాయి. 'మిషన్ ఇంపాజిబుల్: డెడ్ రికనింగ్' వంటి హాలీవుడ్ చిత్రాల సరసన 'జవాన్' నిలిచింది. ఈ సినిమాల్లో పోరాట దృశ్యాల చిత్రీకరణకుగాను 'టారస్ వరల్డ్ స్టంట్ అవార్డు' వరించింది. ఈ సందర్భంగా అనల్ అరసు మీడియాతో మాట్లాడుతూ, 'ఈ అవార్డు వెలకట్టలేనిది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది కూడా. ఇలాంటి అవార్డు రావడం


స్టంట్ మాస్టర్ అనల్ అరసు

అరుదైన గౌరవంగా భావిస్తారు. నాకు ఇలాంటి అవార్డు వచ్చిందన్న విషయం తెలుసుకుని షారూక్ ఖాన్, వరుణ్ ధావన్, షాహిద్ కపూర్, అట్లీ తదితరులు ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఇపుడు 'ఇండియన్-2', 'వా వాత్తియారే', హిందీలో 'బేబీ జాన్', 'వార్-2' వంటి చిత్రాలకు పనిచేస్తున్నాను. ఇదిలా వుంటే, తమిళంలో ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కుమారుడు సూర్యను హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కుతున్న 'ఫీనిక్స్' చిత్రాన్ని అనల్ అరసు నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్న విషయం తెల్సిందే.

వృద్ధ కళాకారులకు ఆర్థిక సాయం

దక్షిణ భారత సినీ, టీవీ, ఫొటో ఫ్లాట్ వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు వృద్ధ కళాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. మొత్తం నలుగురు కళాకారులతో పాటు మరికొందరు చిన్న సహాయ నటులకు ఈ ఆర్థిక సాయంతో పాటు పింఛన్లకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. నగరంలో తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి. ఉదయకుమార్, బుల్లితెర నిర్మాత సంఘం కార్యదర్శి డీఆర్ బాలేశ్వర్, సీనియర్ సినీ పీఆర్వో, కలైమామణి అవార్డు గ్రహీత డాక్టర్ నెల్లై సౌందర్ రాజన్, సంఘ న్యాయ విభాగం సలహాదారు ఎస్.షణ్ముగ సుందరం, సీనియర్ సభ్యుడు టి.మోహన్ తదితరులు పాల్గొని ఈ ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత సినీ, టీవీ, ఫొటో ఫ్లాట్ వర్క్స్ యూనియన్ నిర్వాహకులు, సభ్యులు, ఇతర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ దృశ్యం

అనుపమ ప్రధాన పాత్రలో 'లాక్‌డౌన్'


'లాక్‌డౌన్'లో అనుపమ పరమేశ్వరన్


'ప్రేమమ్' చిత్రం ద్వారా చిత్రపరిశ్రమకు పరిచయమైన అనుపమ పరమేశ్వరన్, తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఈమె ప్రధాన పాత్రధారిగా 'లాక్‌డౌన్' పేరుతో ఒక చిత్రం తెరకెక్కనుంది. లైకా ప్రొడక్షన్స్ బ్యానరుపై సుభాస్కరన్ నిర్మించే ఈ చిత్రాన్ని ఏఆర్ జీవా దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్ఆర్.రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంయుక్తంగా సంగీతం సమకూర్చుతున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో జరిగే స్టోరీతో సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమా రూపొందిస్తున్నట్టు దర్శకుడు ఏఆర్ జీవా వెల్లడించారు. కాగా, అనుపమ పరమేశ్వరన్ తమిళంలో వరుస చిత్రాలకు కమిట్ అవుతున్నారు. తాజాగా ధృవ్ విక్రమ్‌తో 'బైసన్' చిత్రంలో నటించేందుకు ఎంపికకాగా, ఇటీవల 'పరదా' ప్రాజెక్టు కోసం ఆమె సంతకం చేసింది. అలాగే, తెలుగు, మలయాళ భాషల్లో కూడా మరికొన్ని ప్రాజెక్టులను అంగీకరించారు.

'ఒరు నొడి' బృందం నుంచి మరో చిత్రం

ఇటీవల విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'ఒరు నొడి'. అతి తక్కువ బడ్జెట్‌తో రూపుదిద్దుకుని, ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో ఇపుడు విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. అమోఘం ప్రొడక్షన్స్ బ్యానరుపై కే.సుభాషిణి, వైట్ ల్యాంప్ పిక్చర్స్ పతాకంపై కేజీ రితీష్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్ర బృందం మరో కొత్త ప్రాజెక్టుతో మరోమారు ప్రేక్షకుల ముందుకురానుంది. టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రాన్ని 'ప్రొడక్షన్ నెం.1' పేరుతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. 'ఒరునొడి' చిత్ర హీరో తమన్ కుమార్, హీరోయిన్ మాల్వి మల్హోత్ర. వీరితో పాటు మైత్రేయ, రక్షా షెరిన్, అరుణ్ కార్తీ, కాళి వెంకట్, మునీష్‌కాంత్, వేల రామమూర్తి, తలైవాసల్ విజయ్, సంతాన భారతి తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ సంప్రదాయ పూజతో ప్రారంభించారు. చెన్నై, పుదుచ్చేరిలో ఈ సినిమా చిత్రీకరణ జరుపుకోనుంది.


కొత్త చిత్ర ప్రారంభోత్సవ పూజా దృశ్యం








ఎండవేడి.. ఉక్కపోత
అల్లాడిపోయిన జనం

ఈ ఏడాది సమ్మర్ మలమల మాడించేస్తోంది. ఎండవేడిమికి ఉక్కపోత కూడా తోడవడంతో నగర ప్రజానీకం మంగళవారం అల్లాడిపోయారు. కొన్ని చోట్ల రోడ్లపై జనసంచా రం లేక ఆయా రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. గత కొన్ని రోజులుగా ఎండల ప్రభావం అధికంగా వున్న విషయం తెలిసిందే. వేలూరు, సేలం వంటి జిల్లాల్లో అయితే 45 డిగ్రీల వరకు ఎండ తీవ్రత కనిపించింది. మరీ ముఖ్యంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచే ఎండవేడికి తోడు ఉక్కపోత ప్రారంభమైంది. సమయం గడిచే కొద్దీ ఈ ప్రభావం అధికమైంది. అదేవిధంగా సాయంత్రం 6 గంటలకు కూడా ఈ ప్రభావం తగ్గలేదు. ఉక్కపోత కారణంగా ప్రజలు ఇళ్లలోనే ఉన్నారు. ఫ్యాన్లు, ఏసీలను ఆశ్రయించి, వాటి ముందే కాలం వెళ్లదీశారు. ఇక కొబ్బరినీరు, చెరకు రసంతో పాటు చల్లని పానీయాల విక్రయాలకు అడ్డే లేకుండాపోయింది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

చదురగిరి పర్వతారోహణం..
ఆసక్తిగా పాల్గొన్న భక్తులు

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా చదురగిరిలోని సుందర చందన మహాలింగేశ్వరాలయాన్ని దర్శించేందుకు మంగళవారం అమావాస్య రోజున వేల సంఖ్యలో భక్తులు తరలివెళ్ళారు. ఎండవేడి పట్టించుకోకుండా చిన్న పిల్లల నుంచి యువతీయువకులు వరకు అందరూ ఉత్సాహంగా పర్వతారోహణలో పాల్గొన్నారు. ఈ పర్వతాలయాన్ని ప్రతినెలా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో దర్శించేందుకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. చిత్తిరై అమావాస్యను పురస్కరించుకుని నాలుగు రోజులపాటు భక్తులు పర్వతారోహణ చేసి ఆలయాన్ని దర్శించేందుకు అధికారులు అనుమతించారు. దీంతో రెండు రోజులుగా చదురగిరి కొండ ఎక్కేందుకు వేల సంఖ్యలో భక్తులు బారులుదీరారు. చెన్నై, కోవై, తిరుచ్చి, రామనాథపురం, మదురై, తిరునల్వేలి తదితర జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆ పర్వతమార్గం కిటకిటలాడింది. వందల సంఖ్యలో వాహనాల్లో భక్తులంతా పర్వతారోహణ ప్రారంభ ప్రాంతమైన తానిప్పారై చేరుకున్నారు. ఉదయం ఆరుగంటలకు కొండదారిని ఆలయ నిర్వాహకులు, అటవీ శాఖ అధికారులు తెరిచారు. భక్తులు తీసుకెళ్లే సామగ్రిని అధికారులు పరిశీలించిన మీదటే వారిని కొండెక్కేందుకు అనుమతించారు. ఎండవేడి అధికంగా ఉండటంతో భక్తులు తమ వెంట నీరు, గ్లూకోజ్ ప్యాకెట్లు తీసుకెళ్లారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కొండదారిలో అక్కడక్కడా తాగునీటి సదుపాయం కల్పించారు. అదే విధంగా కొండ దిగువ నుంచి ఎగువ వరకూ భక్తులకు రక్షణగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద కూడా భక్తుల తొక్కిసలాటలు జరుగకుండా పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు.. చిత్తిరై అమావాస్యను పురస్కరించుకుని పర్వతాలయంలోని సుందర మహాలింగ స్వామివారికి మంగళవారం ఉదయం 21 రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ట్రస్టీ రాజా అలియాస్ పెరియసామి, కార్యనిర్వాహకులు రామకృష్ణన్ భక్తులకు అన్ని వసతులు కల్పించారు. ఎండవేడి అధికం కావటంతో చాలా మంది భక్తులు ఉదయం పది గంటలకల్లా ఆలయాన్ని సందర్శించి స్వస్థలాలకు బయలుదేరారు.

రామేశ్వరానికి పోటెత్తిన భక్తులు

● చిత్తిరై అమావాస్య సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు


ఆలయం వద్ద భక్తులకు ఎండవేడి తెలియకుండా నిర్మించిన తాత్కాలిక పందిరి


అగ్ని తీర్థం వద్ద పితృదేవతలకు తర్పణాలు విడిచేందుకు వచ్చిన భక్తులు

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): చిత్తిరై అమావాస్య సందర్భంగా మంగళవారం ఉదయం రామేశ్వరం అగ్ని తీర్థం వద్ద భక్తులు పితృదేవతలకు తర్పణాలు వదిలేందుకు వేల సంఖ్యలో గుమికూడారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం రామనాథస్వామి ఆలయం రావణ సంహారం తర్వాత శ్రీలంక నుంచి అయోధ్యకు బయలుదేరి వెళుతూ సీతారాములు దర్శించిన పుణ్యక్షేత్రంగా. హిందువుల తీర్థమూర్తి స్థలంగా విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో దేశవిదేశాల నుంచి వచ్చే భక్తుల అమావాస్య రోజున తమ పితృదేవతలకు తర్పణాలు విడిచిపెడతారు. ఆ మేరకు మంగళవారం చిత్తిరై సర్వ అమావాస్య ను పురస్కరించుకుని వేలాదిమంది భక్తులు అగ్నితీర్థంలో పుణ్యస్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలారు. ఆ తర్వాత రామనాథస్వామివారి ఆలయానికి వెళ్ళి అంతర ప్రాకారంలోని 22 తీర్థ బావుల్లోని జలాలను శిరుస్సులపై చల్లుకున్నారు. చివరగా రామనాథస్వామిని, పర్వతవర్థిని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో జిల్లా ఎస్పీ జి సతీష్ ఆదేశాల మేరకు అదనపు పోలీసు భద్రత కల్పించారు. అగ్నితీర్థ తీరాల్లో భక్తులు విసర్జించే దుస్తులను సేకరించేందుకు కూడా సిబ్బందిని ఏర్పాటు చేశారు. సుమారు 50 మందికిపైగా పారిశుధ్య కార్మికులు తీర్థబావుల పరిసరాలను శుభ్రం చేసారు. భక్తులకు అక్కడక్కడా చలివేంద్రాలను ఏర్పాటు చేసి మజ్జిగ, పానకం, తాగునీరు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎండవేడి నుంచి కాపాడేలా మున్సిపాలిటీ అధికారులు తూర్పు ప్రవేశ ద్వారం వద్ద 500 మీటర్ల పొడవైన ప్లాస్టిక్ టార్పాలిన్‌తో తాత్కాలిక పందిరి కూడా నిర్మించారు. ఈ ఆలయానికి వెయ్యి నుంచి పదివేల వరకు భక్తులు. పర్యాటకులు విచ్చేస్తున్నారు. ఉత్సవాల సమయంలో అమావాస్య రోజుల్లో అత్యధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రస్తుతం ఎండవేడి అధికంగా ఉండటంతో మున్సిపల్ అధికారులు భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. తూర్పు ప్రవేశద్వారం వద్ద ప్లాస్టిక్ టార్పాలిన్ పైకప్పుతో తాత్కాలిక పందిరిని నిర్మించడం పట్ల భక్తులు హర్షం ప్రకటించారు.

పాఠశాలల విద్యాశాఖ పనితీరుపై
బిహార్ కమిటీ పరిశీలన


బీహార్ కమిటీ సభ్యులకు బడిపిల్లలకు అమలు చేస్తున్న పథకాలను వివరిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు సేతురామ వర్మ

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల విద్యాశాఖ పనితీరు పరిశీలించేందుకు 40 మంది తో కూడిన బిహార్ రాష్ట్ర విద్యా కమిటీ నగరానికి విచ్చేసింది. ఐదు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఆ కమిటీ సభ్యులు పాఠశాలల విద్యాశాఖ సంచాలకులు సేతురామ వర్మను కలుసుకున్నారు. ఆ సందర్భంగా పాఠశాలల విద్యాశాఖ అధికారులు బడి పిల్లల కోసం అమలు చేస్తున్న పథకాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. పాఠశాలల విద్యార్థుల కోసం కల్వి టీవీ ద్వారా ప్రసారమవుతున్న కార్యక్రమాలు గురించి కూడా సమగ్రంగా తెలియజేశారు. అదే విధంగా పాఠ్యపుస్తకాలను వివిధ రంగుల్లో ముద్రించే పద్ధతులు, బడిపిల్లలకు అల్పాహార పథకం, పుదుమైపెణ్ పథకం, ఇళ్ళ వద్దకే విద్య తదితర పథకాలను కూడా బిహార్ కమిటీ సభ్యులకు వివరించారు. ఆ కమిటీ సభ్యులు మరో నాలుగు రోజులపాటు పాఠశాలల విద్యాశాఖ వివిధ ప్రాంతాల్లో అమలు చేస్తున్న పథకాలను కూడా పరిశీలించనున్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి : ఆది సత్యేంద్రస్వామి


బాలబాలికలతో ఓం సత్యేంద్రస్వామి

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని అందరూ సేవాభావం పెంపొందించుకుని పేదలకు సేవచేయాలని ఆవలూరులోని ఓం పంచ శక్తి పీఠం పీఠాధిపతి జగద్గురు ఓం ఆది సత్యేంద్రస్వామి అన్నారు. మంగళవారం అరుణోదయం బాలబాలికల గృహాన్ని సందర్శించిన ఆయన అక్కడ దివ్యాంగులైన చిన్నారులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఆ సందర్భంగా విద్యార్థులు స్వామీజీ ఎదుట సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. చివరగా స్వామీజీ బాలబాలికల నొసట తిలకాలు దిద్ది అందరినీ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హోమ్ మేనేజింగ్ ట్రస్టీ అయ్యప్పన్ సుబ్రమణియన్, ట్రస్టీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి అహరహం పాటుపడుతున్నా

● సీఎం స్టాలిన్


అన్నాదురైకి నివాళులర్పిస్తున్న స్టాలిన్ బృందం

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేకించి మహిళాభ్యుదయం కోసం తాను అహరహం పాటుపడుతున్నానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ల పూర్తి చేసుకుందని, ఈ స్వల్పకాలంలోనే తాను ఎన్నో సంక్షేమపథకాలు అమలు చేశానని మంగళవారం తన ఎక్స్ పేజీలో పొందుపరచిన సందేశంలో ఆయన తెలిపారు. ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ అనే తాను గత మూడేళ్లుగా ప్రజలకు సుపరిపాలన అందించానని, మూడేళ్లలో తాను అమలు చేసిన పథకాలన్నీ సత్ఫలితాలిస్తున్నట్లు లబ్ధి పొందిన ప్రజల ముఖాల్లో, మహిళల వదనాల్లో కనుబడుతున్న సంతోషాలే సాక్ష్యం చెబుతాయన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, కలైంజర్ సాధికారిక నగదు పథకం ద్వారా ప్రతి నెలా రూ.1000 పొందుతున్న గృహిణులు, పుదుమైపెణ్ పథకం ద్వారా రూ.1000 తీసుకుంటున్న యువతులు తమ ప్రభుత్వ పనితీరును ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని తెలిపారు. స్టాలిన్ అంటే శ్రమ...శ్రమ అని దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చెప్పినట్లు తాను రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళుల కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు స్టాలిన్ తెలిపారు. తానెప్పుడు తన ప్రభుత్వం అని చెప్పనని, మన ప్రభుత్వమేనని చెబుతానని, ప్రజలందరికీ అన్ని సదుపాయాలు కల్పించడమే తన ధ్యేయమన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, ఆర్థికపరంగా సామాజిక పరంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, దీనికి ప్రజలంతా తనకు అండగా నిలవాలని స్టాలిన్ ఆ సందేశంలో పిలుపునిచ్చారు. ఇదిలా వుండగా డీఎంకే ప్రభుత్వం ఏర్పాటై మంగళవారంతో మూడేళ్ల పూర్తయిన సందర్భంగా మెరీనాలోని దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి సమాధుల వద్ద స్టాలిన్ నివాళులర్పించారు.

డాక్టర్ కావాలని ఉంది

● సీఎం స్టాలిన్‌ను కలిసిన విద్యార్థి

అడయార్, మే 7: రాష్ట్రంలో విడుదలైన ప్లస్‌టూ ఫలితాల్లో 469 మార్కులు సాధించిన నాంగునేరికి చెందిన చిన్నదురై అనే విద్యార్థి మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిశారు. ఈ సందర్భంగా తనకు వైద్య విద్య అభ్యసించాలని ఉందని సీఎంకు చెప్పాడు. మంగళవారం సచివాయంలో సీఎంను నాంగునేరికి చెందిన చిన్నదురై, చెన్నై నగరానికి చెందిన నివేదా అనే హిజ్రా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు విద్యార్థులను ఆయన అభినందించారు. నాంగునేరికి చెందిన విద్యార్థి చిన్నదురై స్థానికంగా ఎన్నో అవమానాలు, అంటరానితనం ఎదుర్కొని పట్టుదలతో చదివి 600 మార్కులకుగాను 469 మార్కులు సాధించగా, ఆ విద్యార్థిని సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖామంత్రి అన్బిల్ మహేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ్‌దాస్ మీనా, పాఠశాల ముఖ్య కార్యదర్శి కుమారగురు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ అరివొళి, నెల్లై జిల్లా విద్యాధికారి ముత్తుస్వామి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా హిజ్రా నివేదా మాట్లాడుతూ, ప్లస్‌టూ పరీక్షల్లో తాను ఉత్తీర్ణత సాధించడం తన వర్గానికి, తల్లిదండ్రులకు, బంధువులకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు. తనకు వైద్య విద్యను అభ్యసించాలనివుందని ఆమె వెల్లడించారు. ఆ తర్వాత చిన్నదురై మాట్లాడుతూ, కులవిద్వేషంతో తనపై దాడి జరగడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందానని తెలిపారు. ఆస్పత్రిలో ఉంటూనే చదివి పరీక్ష రాసినట్టు తెలిపారు.


సీఎంతో చిన్నదురై, నివేదా తదితరులు

జన చేతనం

www.andhrajyothy.com

బుధవారం 8 మే 2024

క్వారీ లాక్కుని కరెంటు బిల్లూ కట్టకుండా..


జనార్ధన్‌నాయుడు

కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన జనార్దన్ నాయుడికి పలమనేరు మండలం నెల్లిపట్ల వద్ద క్వారీ ఉంది. 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన వెంకటేగౌడ దాన్ని ఆక్రమించుకున్నారు. 'అధికారాన్ని అడ్డం పెట్టుకుని, సీఎం జగన్ పేరు చెప్పుకొని నా క్వారీని వెంకటేగౌడ లాక్కున్నారు. అందులోని యంత్రాలు కొనుగోలు చేసినట్లు రూ.1.48 కోట్లకు అగ్రిమెంటు రాయించుకున్నారు. రూ.37 లక్షలు, రూ.5 లక్షలకు చెక్కులు ఇచ్చారు. రూ.37 లక్షల చెక్ బౌన్స్ అయింది. కేసు కోర్టులో నడుస్తోంది. రూ.5 లక్షల చెక్ కూడా బౌన్స్ అయింది. దీనికి సంబంధించి రూ.4 లక్షలు వేరేవాళ్ల ద్వారా సెటిల్ చేశారు. రూ.48 లక్షల కరెంటు బిల్లు బకాయి ఉందని నాకు నోటీసులు వస్తున్నాయి. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాను' అని జనార్దన్ నాయుడు ఆవేదన వ్యక్తంచేశారు.

పలమనేరు నియోజకవర్గానికి సరిహద్దు కర్ణాటక రాష్ట్రం. ఇసుక, మట్టి, ఎర్రచందనం, పశువుల కబేళాలు, బియ్యం.. అక్రమ రవాణాకు గేట్‌వేగా పలమనేరును మార్చేశారు. ఇందులో ప్రతి దానికీ వైసీపీ ఎమ్మెల్యే వెంకటేగౌడకు కచ్చితంగా వాటా ఇవ్వాల్సిందేనన్న ప్రచారం జోరుగా ఉంది. ఒక్క ఇసుక అక్రమ రవాణా కమీషన్లే ఈ ఐదేళ్లలో రూ.వంద కోట్ల వరకు ఉంటుందని విపక్షాలు అంటున్నాయి. గత ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన పది హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా రికార్డు సృష్టించారు. అధికారంలో ఉండి.. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడే ఇలా వ్యవహరించిన వెంకటేగౌడ.. రెండోసారి గెలిస్తే నియోజకవర్గాన్ని ఇంకేం చేస్తారోనని అక్కడి ప్రజలు అంటున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

అవినీతి అనకొండ!



- ఇసుక, మట్టి, భూమి, క్వారీలను వదలరు
- అక్రమ రవాణా ఏదైనా కమీషన్లు చేరాల్సిందేనట
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తీరుపై విమర్శలు
- ఒక్క హామీనీ నెరవేర్చని ఎమ్మెల్యేగా రికార్డు

మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?





కర్ణాటక సరిహద్దు ప్రాంతం నాలుగు రోడ్ల సమీపంలో ఇసుక డంప్ - పలమనేరు కేటిల్ ఫాం వద్ద కౌండిన్య నదిలో ఇసుక తవ్వకాలు

ఇసుక అక్రమ రవాణాలో రూ.వంద కోట్లు!

పెద్దపంజాణి మండలంలోని శంకర్రాయలపేట చెరువు (మాడీచెరువు), గంగవరం మండలంలోని దండపల్లి చెరువు, ఆయా మండలాల్లో ప్రవహించే కౌండిన్య నదీ పరివాహక ప్రాంతాల నుంచి పగటి పూట ఇసుకను తోడేసి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని నాలుగు రోడ్ల వద్ద డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రిళ్లు కర్ణాటకకు తరలిస్తారు. కర్ణాటకలో ఒక్కో టిప్పర్ రూ.60 వేలకు అమ్ముకుంటున్నారు. ఇలా నియోజకవర్గం నుంచీ కర్ణాటకకు అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోంది. వీరంతా ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపణలున్నాయి. ఒక్కో టిప్పర్‌కు రూ.20 వేలు చొప్పున వీరు ఎమ్మెల్యేకి కప్పం కడతారని, తద్వారా ఐదేళ్లలో ఆయన రూ.వంద కోట్లు సంపాదించినట్లు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాగే, ఈ ప్రాంతం నుంచి పశువుల కబేలాలు, మట్టి, బియ్యం, ఎర్రచందనం వంటివి అక్రమ రవాణా నుంచీ ఎమ్మెల్యేకు కమీషన్లు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇందిరమ్మ కాలనీలో పట్టాల అమ్మకం

పలమనేరు పట్టణ పరిధిలోని గంటావూరులో 2007లో అప్పటి సీఎం వైఎస్సార్ సుమారు 8 ఎకరాల్లో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటుచేసి రెండు వేల మందికి పట్టాలిచ్చారు. అక్కడ సగం మంది నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారు. స్థానికంగా ఇద్దరు మండల స్థాయి మైనార్టీ నాయకులు ఆ కాలనీలో మకాం వేసి ఖాళీ స్థలాలకు ఫేక్ పట్టాల్ని తయారుచేసి అమ్ముకున్నారు. ఒక్కో పట్టాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి.. రూ.కోట్లలో వెనకేసుకున్నారు. ఇందులో ఎమ్మెల్యేకు కూడా వాటా వెళ్లినట్లు సమాచారం.



మహిళా అధికారితో దురుసు ప్రవర్తన

వి.కోటలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేస్తుండగా, వైసీపీ నాయకులు గ్రానైట్ రాళ్లను సరఫరా చేశారు. ఆమె బిల్లులు అడిగితే ఇవ్వలేదు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కల్పించుకుని రాళ్ల వాహనాన్ని పంపాలని అడిగ్గా మహిళా అధికారి వినలేదు. దీంతో ఆమె పట్ల ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించారు. ఆమె సిబ్బంది మీద దాడి చేశారు. ఆ మహిళా అధికారి ఎమ్మెల్యే మీద కేసు పెట్టేందుకు ప్రయత్నించగా, రాజీ చేశారు.

నిరుపేదలను పీడించారు

పలమనేరు పట్టణంలో ఎంబీటీ రోడ్డు పక్కన దశాబ్దాల కాలంగా పేదలు చిన్న చిన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వాటిని నిబంధనల పేరుతో తొలగించి తమ వారికి కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే మనుషులు అధికారుల మీద ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆ పేదలు రూ.లక్షలు ఖర్చు చేసి హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవాల్సి వచ్చింది.

పెద్దఎత్తున గంజాయి, కర్ణాటక మద్యం

నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో గంజాయి లభ్యత, వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పోలీసుల దాడుల్లో వందల కేజీల్లో గంజాయి దొరుకుతోంది. సమీపాన ఉన్న కర్ణాటక నుంచి మద్యం టెట్రా ప్యాకెట్లను తెచ్చుకుని వైసీపీ నాయకులు బెల్ట్ షాపుల్లో పెట్టి అమ్ముకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఈ మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. రోజుకు రూ.2 లక్షలు, నెలకు రూ.60 లక్షల అక్రమ వ్యాపారం సాగుతున్నట్లు అంచనా. గంజాయి, మద్యం కారణంగా స్థానిక యువత పక్కదారి పడుతున్నారు.

స్థలం కనిపిస్తే కబ్జాకు యత్నం

నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనుచరులు రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాల్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఎప్పటికప్పుడు టీడీపీ శ్రేణులు గుర్తించి అడ్డుకున్నారు. పలమనేరు జవిలి వీధిలో మత్స్య శాఖ స్థలాన్ని ఆక్రమించుకుని, తమ వారికి కేటాయించేందుకు ప్రయత్నించారు. దీనిని టీడీపీ శ్రేణులు అడ్డుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడారు.

- మదనపల్లె రోడ్డులో టీడీపీ ప్రభుత్వం బీసీ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. మాజీ మంత్రి అమర్ సమక్షంలో తెలుగు తమ్ముళ్లు తిరగబడడంతో ఈ రోజు ఆ స్థలం మిగిలి ఉంది.
- వి.కోటలో ఉర్దూ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ నిర్మాణానికి టీడీపీ కేటాయించిన రూ.కోట్ల విలువ చేసే స్థలాన్నీ కబ్జాకు యత్నించారు. టీడీపీ శ్రేణులు అడ్డుకోగా.. అమరనాథరెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వారి ఆక్రమణ ఆగింది.
- గంగవరం మండలం మదనపల్లె ప్రధాన రహదారిలో ఇటీవల వైసీపీ నాయకులు అక్రమ పట్టాలతో రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని కొట్టేయాలని చూశారు. టీడీపీ నాయకుల చొరవ.. అధికారులకు ఫిర్యాదు చేయడంతో అది ప్రభుత్వ స్థలమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.



మత్స్యశాఖ స్థలాన్ని ఆక్రమించేందుకు తవ్వారిలా.. (ఫైల్ ఫొటో)

- పలమనేరు నడిబొడ్డున ఉన్న శివాలయ భూముల్ని బైరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నేత, అనుచరులు 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. ఇప్పుడు అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకు ఇచ్చారు.

మోసం గురూ

- విద్యుత్ సబ్ స్టేషన్లు, ఆస్పత్రులు, వెలుగు కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో చిన్నపాటి ఉద్యోగాలిప్పిస్తామని వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు యువత నుంచి డబ్బులు వసూలు చేశారు. ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. ఎవరైనా నిలదీస్తే ఎమ్మెల్యే పేరు చెప్పి దబాయించేశారు.
- వి.కోట మండలానికి చెందిన ఎమ్మెల్యే అనుచరుల్లోని ఇద్దరు నాయకులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పేరుతో గ్రానైట్ వాహనాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.
- ఇటీవల పుంగనూరులో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేసి, పలమనేరు డిపో నుంచి చాలా బస్సుల్ని అక్కడికి తరలించేశారు. అయినా ఎమ్మెల్యే ప్రేక్షక పాత్ర పోషించారే తప్ప ఏం చేయలేకపోయారు.
- బైరెడ్డిపల్లె మండలానికి చెందిన ఎంపీటీసీ, ఎమ్మెల్యే అనుచరుడు అభినవ్ ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు.

కరోనా సమయంలోనూ పబ్లిసిటీ పిచ్చి

కరోనా లాక్‌డౌన్ సమయంలో వి.కోట మండలం భారత్‌నగర్‌లో ఓ బ్రిడ్జిని నిర్మించగా, ఎమ్మెల్యే పెద్దఎత్తున జనాలతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. కరోనా కారణంగా ప్రజలు బయటికి రాకూడదని నిబంధన ఉన్నా లెక్కచేయకుండా ప్రారంభించడంతో మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో ఎమ్మెల్యే మళ్లీ ఆ ప్రాంతానికి వచ్చి హంగామా చేసి, మీడియా వాళ్లను దారుణంగా తిట్టారు. జాతీయ స్థాయిలో ఈయన తీరు గురించి మీడియా తప్పు పట్టింది.

లీడర్స్ వాయిస్

వైసీపీ పనైపోయింది!

"ఇందిరా గాంధీ మరణించి నలభై ఏళ్ళవుతున్నా ఇంకా జనంలో ఆమె పట్ల అభిమానం తగ్గలేదు. పార్టీ ప్రచారంలో భాగంగా వేలమందిని నేరుగా కలిశా. ఇందిరా గాంధీ ఫొటో కనిపించగానే ఇప్పటికీ జనం మొక్కుతున్నారు."

పట్టణాల్లో వాష్ అవుట్
పల్లెల్లో పునాదులు కదిలిపోయాయి
కాంగ్రెస్ తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతా మోహన్



తిరుపతి, ఆంధ్రజ్యోతి

అపారమైన అనుభవంగల నాయకుడు చింతా మోహన్. 1984 నుంచీ 2021 దాకా తిరుపతి లోక్‌సభ స్థానానికి 11 సార్లు ఎన్నికలు జరిగితే, పదిసార్లు ఆయన బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి ఒకసారి, కాంగ్రెస్ నుంచి ఐదు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రిగా చేశారు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా నిరంతరం జనంలో తిరుగుతూ ఉండే చింతామోహన్ 11వ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా తిరుపతి నుంచి పోటీ చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయ వర్తమాన పరిణామాలపై చింతా మోహన్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణలోని కొన్ని ముఖ్యాంశాలు..

వైసీపీకి 30 సీట్లు లోపే

ఈ ఎన్నికల్లో తిరుపతిలో అధికార పార్టీ పనైపోయింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాకు మంచి మిత్రుడు. అందుకే ఇంతకు మించి చెప్పలేను. రాష్ట్రం మొత్తం మీద ఆ పార్టీ పరిస్థితి గురించి చెప్పాల్సి వస్తే నగర, పట్టణ ప్రాంతాల్లో వైసీపీ ఇప్పటికే తుడిచి పెట్టుకుపోయింది. ఎంతో కొంత గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీకున్న బలమైన పునాదులు కూడా దెబ్బతిన్నాయి. జగన్‌కు రెండో ఛాన్సు ఇవ్వడానికి జనం సిద్ధంగా లేరు. 175 సీట్లకు గానూ ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి 30 సీట్లకు మించి రావు.

మా ఓట్‌షేర్ వైసీపీ నుంచే

కాంగ్రెస్ పుంజుకోవడం వెనుక వైఎస్ షర్మిల ప్రభావం కొంత మేరకు వుంది. కాంగ్రెస్ ఓటు షేర్ ఖచ్చితంగా పెరిగింది.ఆ ఓటు షేర్ వైసీపీ నుంచే లాక్కుంటున్నాం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కొడుకు కావడం వల్ల కాంగ్రెస్, జగన్ ఒకటే అని గ్రామీణజనం నమ్ముతూ వచ్చారు. జగన్ వేరు, కాంగ్రెస్ వేరు అనే అభిప్రాయం ఇప్పుడు ప్రజల్లో కలిగిస్తున్నాం.

ధరల దోపిడీ

నిత్యావసర వస్తువులు, సేవల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దానికి తోడు అధిక పన్నులతో జనం దోపిడీకి గురవుతున్నారు. నిరుద్యోగ సమస్యతో యువత సతమతమవుతోంది. ప్రజలకు ఏమి అవసరమో, వారు ఏమి కోరుకుంటున్నారో గ్రహించడంలో వైసీపీ, తెలుగుదేశం పార్టీలు విఫలమయ్యాయి.

ఎంపీగా తిరుపతికి రూ. లక్ష కోట్లు తెచ్చా!

ఎంపీగా సుదీర్ఘకాలం పనిచేసినప్పటికీ కేవలం పదేళ్ళ యూపీఏ ప్రభుత్వ హయాంలోనే తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి రూ. లక్ష కోట్లు కేంద్రం నుంచీ తెచ్చా.తిరుపతి-చెన్నై,తిరుపతి-కొచ్చిన్, తిరుపతి-బెంగుళూరు, తిరుపతి-అనంతపురం, తిరుపతి-నాయుడుపేట, తిరుపతి-కడప-కర్నూలు-హైదరాబాదు, తిరుపతి-ఏర్పేడు-వెంకటగిరి మీదుగా మహారాష్ట్ర.. ఇలా ఏడు జాతీయ రహదారులు మంజూరు చేయించా. కిలోమీటరుకు రూ. 20 కోట్లు చొప్పున 3500 కిలోమీటర్ల ఈ రహదారులకు అప్పట్లోనే రూ. 70 వేల కోట్లు విడుదల చేయించా. మన్నవరంలో ఎన్‌టీపీసీ-భెల్ జాయింట్ ప్రాజెక్టుకు రూ. 8 వేల కోట్లు మంజూరు చేయించడంతో పాటు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో శంకుస్థాపన కూడా చేయించా. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు రూ. 10 వేల కోట్లు క్యాబినెట్‌లో అప్రూవ్ చేయించి పార్లమెంటులో బిల్లు పెట్టించా. ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ని చేసిన.. ఇంత నిధులు కేంద్రం నుంచి సాధించిన ఒక్క ఎంపీ పేరును ఎవరైనా చెప్పగలరా?

తిరుపతికి అంతర్జాతీయ స్థాయి

తిరుపతి విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయిని అందుకోవడం వెనుక నా కృషి వుంది. అంతే కాదు ఐఐఎస్ఈఆర్, ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థలను విభజన చట్టంలో పెట్టించి రాష్ట్రానికి వచ్చేందుకు కారకుడినయ్యా. తిరుపతి-కాట్పాడి మీటర్ గేజ్ రైల్వే లైన్‌ను బ్రాడ్ గేజిగా మార్పించా. అలాగే గూడూరు రైల్వే లైన్‌ను డబుల్ లైన్ చేయించా. తిరుపతికి గతంలో రోజువారీ పది రైళ్ళు మాత్రమే వచ్చేవి. అలాంటిది వాటి సంఖ్య ఏకంగా 60కి పెంచా.

స్విమ్స్ ప్రైవేటుపరం కాకుండా కాపాడా!

2005లో తిరుపతి స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అపోలో సంస్థకు అమ్మకానికి పెట్టారు. ఆ విషయం తెలుసుకుని స్విమ్స్‌కు ఆర్థిక పరిపుష్టి కోసం రూ. వంద కోట్లు కేటాయించాలని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌పై ఒత్తిడి తెచ్చాను. అయితే ప్రధాని రూ. 60 కోట్లు ఇచ్చారు.దానివల్లే స్విమ్స్ ప్రైవేటు పరంకాకుండా నిలబడింది.సామాన్య ప్రజలకు వైద్యసేవలు అందించగలుగుతోంది. అంతే కాకుండా స్విమ్స్ ఆధ్వర్యంలో 300 పడకల చిన్నపిల్లల ఆస్పత్రిని, అలాగే 300 పడకల మెటర్నిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించా. ఎస్వీ మెడికల్ కళాశాలలో పీజీ సీట్ల పెంచేందుకు కృషి చేశా. జిల్లా నుంచీ మామిడిని విదేశాలకు ఎగుమతి చేయడానికి వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటు చేయించా. ఈ ప్రభుత్వం దాన్ని ప్రైవేటుపరం చేసింది. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పదిహేను ఆలయాల అభివృద్ధికి హెరిటేజ్ టూరిజం ప్రాజెక్టు ప్రతిపాదించి కేంద్రం నుంచీ రూ.వంద కోట్లు విడుదల చేయించేందుకు ప్రయత్నించా. అయితే కేంద్రం రూ.47కోట్లు కేటాయించడంతో ఆ నిధులను కాణిపాకం నుంచీ పెంచలకోన దాకా, అలాగే నెల్లూరులో రంగనాథస్వామి ఆలయానికి కూడా విడుదల చేయించా.

అవకాశమిస్తే చేయాల్సింది ఎంతో వుంది!

తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నేను పునాది వేయిస్తే దాన్ని జరగనివ్వకుండా ఆపేశారు. తిరుపతిలోనే రూ.292 కోట్లతో ఏడు వేలమందికి డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు మంజూరు చేయిస్తే ఆ ప్రాజెక్టును కూడా ఆపేశారు.దుగరాజపట్నం పోర్టు వస్తే సూళ్ళూరుపేట, నాయుడుపేట, గూడూరు, పెళ్ళకూరు, కోట, వాకాడు ప్రాంతాల్లో భూములకు విలువ పెరుగుతుంది. ఆ ప్రాంత రైతులకు మంచి జరుగుతుంది. ఉద్యోగావకాశాలు కూడా వస్తాయి. తిరుపతిలో ఎస్వీ జూపార్కు ఏడు వేల ఎకరాల్లో విస్తరించి వుంది. జూ పార్కును అక్కడినుంచీ భాకరాపేట లేదా పుత్తూరు వైపు తరలిస్తే ఆ ఏడు వేల ఎకరాలు పేద, మధ్య తరగతి, ఉద్యోగులకు ఇళ్ళ స్థలాల కోసం కేటాయించడానికి అవకాశముంటుంది. అలాగే అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత భూములిస్తే సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎందుకు రావు?